838) గౌళ

ప॥ అఱిముఱి హనుమంతుడు అట్టి బంటు। వెఱపులేని రఘువీరునికి బంటు॥

చ॥ యేలికను దైవముగా నెంచి కొలెచేవాడే బంటు। తాలిమిగలిగినయాతడే బంటు।
పాలుమాలక యేపొద్దు పనిసేయువాడే బంటు। వేళ గాచుకవుండేటి వెరవరే బంటు॥

చ॥ తను మనోవంచన లెంతటా లేనివాడే బంటు। ధనముపట్టున శుద్ధాత్మకుడే బంటు।
అనిశము నెదురు మాటాడనివాడే బంటు। అనిమొన తిరుగనియతడే బంటు॥

చ॥ చెప్పినట్లనే నడచినయాతడే బంటు। తప్పలేక హితుడైనాతడే బంటు।
మెప్పించుక విశ్వాసాన మెలగువాడే బంటు। యెప్పుడును ద్రోహిగాని హితుడే బంటు॥

చ॥ అక్కర గలిగి కడు నాప్తుడైనవాడే బంటు। యెక్కడా విడచిపోనియిష్టుడే బంటు।
తక్కక రహస్యములు దాచినవాడే బంటు। కక్కసీడుగాక బత్తిగలవాడే బంటు॥

చ॥ కానిపనులకు లోనుకానివాడే బంటు। ఆనాజ్ఞ మీరనియాతడే బంటు।
నానాగతి శ్రీవేంకటేశోన్నతుడైన యతనికి। తా నిన్నిటా దాసుడైన ధన్యుడే బంటు॥